లలిత త్రిపుర సుందరి అలంకరణలో దుర్గామాత



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని పలు ప్రాంతాల్లో దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బతుకమ్మకుంట ఆవరణలోని దుర్గామాత దేవాలయం వద్ద నిర్వహిస్తున్న దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని లలిత త్రిపుర సుందరిగా అలంకరించారు. పాతబీటు బజారులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు.

బొగత.. పర్యాటకుల పులకింత



జలపాతం నీటిధారలను తిలకిస్తున్న పర్యాటకులు

వాజేడు, న్యూస్‌టుడే: బొగత జలపాతంలో సందర్శకులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో జలపాతం కోలాహలంగా మారింది. నీటి జలధారలను తిలకిసూ సందడి చేశారు.. నీటి కొలనులో ఈత కొడుతూ కేరింతలు చేశారు. జలపాతం నుంచి వస్తున్న వరద నీటికి ఎదురుగా ఈత కొడుతూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో సరదగా గడిపారు.

భద్రకాళి.. బంగారు తల్లి



స్వర్ణ కిరీటం, జుటామకుటాలు, కర్ణ పత్రాలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన ఓరుగల్లు శ్రీభద్రకాళి అమ్మవారు బంగారు ఆభరణాలతో దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు అనేకం ఉన్నాయి. పసిడి కాంతులతో దర్శనమిస్తున్న భద్రకాళి మాతను చూసి భక్తులు పులకించిపోతున్నారు.

● శ్రీదేవి శరన్నవరాత్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటా మకుటాలు, కర్ణ పత్రాలు అమ్మవారికి అలంకరిస్తారు. శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో కొన్ని ఆభరణాలు అలంకరిస్తారు.

అమ్మవారి ఆభరణాలు ఇవే..

● బంగారు స్వర్ణ కిరీటం: 4 కిలోల 70 గ్రాముల 088 మిల్లీగ్రాములు ● కర్ణ పత్రము- 1 కిలో 202 గ్రాముల 004 మి.గ్రా ● కర్ణ పత్రము-1 కిలో 149 గ్రాముల 022 మి.గ్రా ● జటా మకుటం- 2 కిలో 273 గ్రాము 013 మి.గ్రా. ● జటా మకుటం 2 కిలోల 368 గ్రాముల 040 మి.గ్రా. ● తెల్లరాళ్లతో ముక్కు పోగు పెద్దది: 104 గ్రా. ● చంద్ర వంక బొట్టు: 65 గ్రా 300 మి.గ్రా. (124 చిన్న ఎరుపు రాళ్లు, 01 పెద్ద ఎరుపు రాయి) ● ఒక ఎర్ర రాళ్ల బంగారు గాజు 340 గ్రా. ● ఒక ఎరుపు రాయి ముక్కు పోగు 10 గ్రా. ● అష్టలక్ష్మి చెంబు 605 గ్రా 600 మి.గ్రా ● ఒక రాళ్ల ముక్కు పోగు 19 గ్రా 950 మి.గ్రా ● ఒక తెల్ల రాళ్ల ముక్కు పోగు 21 ముత్యాలు, ఒక ఎర్ర పూస, 13.600 మి.గ్రా ● లక్ష్మి కాసుల నెక్లెస్ 20 గ్రా. 570 మి.గ్రా ● లక్ష్మి కాసుల పేరు 21గ్రా. 300 మి.గ్రా. ●2 బంగారు గాజులు 16 గ్రా. 220 మి.గ్రా ● లక్ష్మి రూపంతో ఉన్న పచ్చల కెంపుల హారం 086- 730 మి.గ్రా ● అమ్మవారి రెండు పెద్ద పుస్తెలు, తాడు, రెండు గొట్టాలు, రాగి తీగతో కలిపి 192 గ్రా. ● పెద్ద ముక్కెర రాళ్లతో 44 గ్రా. ● అమ్మవారి పెద్ద మాంగల్య సూత్రం, తాడు, బంగారు గొట్టాలు, బంగారు గుండ్లు 130 గ్రా. ● కాసుల పేరు, రాళ్ల ముక్కు పోగు 262 గ్రా. ● ఒక ముక్కు పోగు 18గ్రా 850 మి.గ్రా.

–న్యూస్‌టుడే, రంగంపేట

బ్యాంకు లాకర్‌లోనే..: రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జుటా మకుటాలు, కర్ణ పత్రాలు, భక్తులు, దాతలు ఇచ్చిన బంగారు ఆభరణాలన్నీ హనుమకొండలోని బ్యాంకు లాకర్‌లో భద్ర పరుస్తారు. రోజు వారీగా అలంకరించే ఆభరణాలు దేవస్థానంలో ఉంటాయి.



కాసుల పేరు హారం


లక్ష్మి కాసుల హారం




బంగారు గాజులు


రెండు పెద్ద గాజులు


అష్టలక్ష్మి బంగారు చెంబు


పెద్ద మాంగల్యం


పెద్ద పుస్తెలు


పచ్చల హారం


చంద్ర వంక


ముక్కు పుడక


ముక్కు పోగు

మూతపడిన అతిథి గృహం



నిజాం కాలంలో నిర్మితమై చెక్కుచెదరకుండా ఉన్న బచ్చన్నపేట అతిథి గృహంపై పట్టింపు లేని తనం కారణంగా మూతపడింది. అధికారుల నిర్లక్ష్యంతో 9 ఏళ్లుగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. నిజాం ప్రభుత్వ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తంలో 10 నిర్మించారు. అందులో బచ్చన్నపేట ఒకటి. నిజాం పాలకులు ఈ ప్రాంత పర్యటన సమయంలో ఇందులో సేదదీరేవారని పూర్వీకులు చెబుతున్నారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రభుత్వాల పరిధిలోని రోడ్డు, భవనాల శాఖ అధికారులు ఈ భవనాలపై పర్యవేక్షణ కొనసాగించారు. ప్రజాప్రతినిధులు ఇక్కడికి వచ్చినపుడు బస చేసేవారు. ప్రత్యేక గదులతోపాటు, బాత్‌రూమ్, ఫర్నిచర్ ఉన్నాయి. పలుమార్లు ప్రభుత్వం నిధులు వెచ్చించి ఈ భవనానికి మర్మమతులు చేశారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బచ్చన్నపేట

హేమాచల క్షేత్రంలో భక్తుల పూజలు



మల్లూరు (మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరుగుట్టపై శ్రీహేమాచల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఒకే వేదికపై ఆరు తరాల సందడి

రెండు, మూడు తరాలు కలుసుకోవడమే కష్టంగా మారిన ఈ రోజుల్లో ఏకంగా ఆరుతరాల కుటుంబసభ్యులు ఒకేచోట కలిశారు. తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు, పెద్దనాన్నలు, పెద్దలు, పిల్లలు అందరూ ఆప్యాయంగా మాట్లాడుకున్నారు.. కలిసి సందడి చేశారు. ఈ అపూర్వ దృశ్యం ఆదివారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలకేంద్రం వేదికైంది. ఆదివారం 'బోడకుంటి' పూర్వీకుల నుంచి దాదాపు 250 మంది ఆరు తరాలకు చెందిన కుటుంబ సభ్యులు ఒకే వేదికగా ఆత్మీయంగా కలిశారు. ఈ వేడుకలో కుటుంబ సభ్యుల్లో ఒకరైన మాజీ ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రతి కుటుంబం ఇలాగే కలిసి మెలిసి ఉండి రాబోయే తరాలకు మంచి సందేశం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బోడకుంటి రాములు, విశ్రాంత ఉపాధ్యాయుడు బోడకుంటి మల్లయ్య, కుటుంబ సభ్యులు శ్రీనివాస్, క్రాంతికుమార్, అనిల్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బచ్చన్నపేట

ముగిసిన డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 నియామకంలో భాగంగా 1:3 నిష్పత్తిలో ఎంపికైన స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, భాషోపాధ్యాయ విభాగాలకు సంబంధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రిస్టన్ పాఠశాలలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనలో 1:3 నిష్పత్తిలో 533 మందిని ఎంపిక చేయగా 517 మంది హాజరయ్యారని, 16 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. ఇందులో 1:1 నిష్పత్తి ప్రకారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

సబ్జెక్టుల వారీగా పూర్తి వివరాలు..

పోస్టులు	మొత్తం పోస్టులు	1:3 నిష్పత్తి ప్రకారం	పరిశీలనకు హాజరైంది	గైర్హాజరైంది
లాంగ్వేజ్ పండింట్ హిందీ	9	19	17	2
లాంగ్వేజ్ పండిట్ తెలుగు	12	31	30	1
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	7	21	21	0
ఎస్ఏ-బయాలాజికల్ సైన్స్ (తె.మీ	11	29	27	2
ఎస్ఏ-ఇంగ్లిషు	6	15	15	0
ఎస్ఏ-హిందీ	2	6	6	0
ఎస్ఏ-గణితం (తె.మీ)	7	19	18	1
ఎస్ఏ-ఫిజికల్ సైన్స్(తె.మీ)	3	9	9	0
ఎస్ఏ- సాంఘిక శాస్త్రం(తె.మీ)	16	45	42	3
ఎస్ఏ-తెలుగు	4	12	12	0
ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్	5	10	10	0
ఎస్జీటీ (తె.మీ)	117	302	295	7
ఎస్జీటీ (ఉ.మీ)	1	3	3	0
ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్	20	9	9	0

● పోస్టులు ● మొత్తం పోస్టులు ● 1:3 నిష్పత్తి ప్రకారం ● పరిశీలనకు హాజరైంది ● గైర్హాజరైంది.

పీహెచ్‌సీలో హాజరుపై
ప్రత్యేక కసరత్తు..!



విధుల్లో భాగంగా గ్రూప్‌లో ఫొటో నమోదు చేస్తున్న ఇప్పగూడెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండు నెలలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీలు) సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ)లను కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సమయంలో పలు ఆసుపత్రుల్లో వైద్యులు విధులకు హాజరు కానీ సంఘటనలు వెలుగుచూశాయి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పలువురు వైద్యులకు పలుమార్లు కలెక్టర్ ఆదేశాలతో డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్ మెమోలు, షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వైద్య సిబ్బంది హాజరుపై కలెక్టర్‌కు పత్యేక దృష్టి సారించి పలు చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లా వివరాలు..

జిల్లాలో మొత్తం పీహెచ్‌సీలు	:	12
సీహెచ్‌సీలు	:	4
బయోమెట్రిక్ యంత్రాల కొనుగోలు వ్యయం	:	96 వేలు

వాట్సాప్ గ్రూప్‌లో హాజరు..

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది విధులకు వచ్చిన సమయం, తిరిగి వెళ్లే సమయంతో పాటు రోగులకు అందిస్తున్న చికిత్స, ఓపీ వివరాలను నమోదు చేసి ప్రతి రోజూ అటెండెన్స్ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసే విధంగా చర్యలు చేపట్టారు. 2 నెలలుగా ఈ విధానం కొనసాగుతోంది. సీహెచ్‌సీల్లో షిప్టుల వారీగా విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది వాట్సాప్ గ్రూప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. దీనిని డీఎంహెచ్‌వో రవీందర్‌గౌడ్ పర్యవేక్షిస్తుంటారు. గ్రూప్‌లో ఉన్న కలెక్టర్ ఎప్పటికప్పుడు సూచనలను నమోదు చేయడంతో జిల్లా వ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారు. సమయపాలన పాటిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బయోమెట్రిక్ ఏర్పాటు..

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో బయోమెట్రిక్ హాజరును ప్రవేశపెట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు సీహెచ్‌సీల్లో బయోమెట్రిక్ యంత్రాలను బిగించారు. మరో 12 పీహెచ్‌సీల్లో బిగింపు ప్రక్రియ సాగుతోంది. సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అంతర్జాల సౌకర్యంతో బయోమెట్రిక్ అమలుకు యోచిస్తున్నారు. ఒక్కో బయోమెట్రిక్ యంత్రానికి రూ.9 వేల చొప్పున మొత్తం 16 ఆసుపత్రులకు కొనుగోలు చేశారు. త్వరలో బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తే సేవలు మరింత మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.

ఇబ్బందులు కలుగకుండా చర్యలు

- డాక్టర్ రవీందర్‌గౌడ్, జిల్లా వైద్యాధికారి

జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో వైద్య సేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు వైద్య, సిబ్బంది హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాం. కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షించి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయించారు. త్వరలో బయోమెట్రిక్ హాజరు అమలులోకి రానుంది.

విద్యుత్తు ఉద్యోగుల బతుకమ్మ సంబరాలు



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలో విద్యుత్తు శాఖ డివిజన్ కార్యాలయంలో ఆదివారం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యులు వేడుకలో పాల్గొన్నారు. భారీ బతుకమ్మలను అలరించాయి. ఉయ్యాల పాటలు, కోలాటాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ జనగామ సర్కిల్ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీఈ వేణుగోపాల్, యూనియన్ నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగమేళా

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో రేపు (మంగళవారం) ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మానుపాటి మల్లయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన యెస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకుల్లో సెల్స్ ఆఫీసర్‌గా పని చేసేందుకు 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి, ఏడాది అనుభవం ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హత పత్రాలు (జిరాక్స్) తో రేపు కలెక్టరేట్‌లోని గది నెంబర్ (ఎస్-8)లో నిర్వహించే ముఖాముఖిలో పాల్గొనాలని, పూర్తి వివరాలకు 7995430401 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని బీసీ, ఈబీసీ, సంచార, పాక్షిక సంచార తెగలు, డి-నోటిఫైడ్ తెగల(డీఎన్‌టీ) కు చెందిన విద్యార్థులు పీఎం యశస్వీ ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి బి.రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 లోగా http://yet.nta.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

90 శాతం సన్నాలే సాగు..!

ధాన్యం కొనుగోలుకు యంత్రాంగం సన్నద్ధం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా వానాకాలం ధాన్యం సేకరణకు అధికారయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల సంఖ్య, లక్ష్యాన్ని ప్రకటించింది. మరో 25 రోజుల్లో వరికోతలు ప్రారంభం కానుండడంతో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వనున్న నేపథ్యంలో వాటి సేకరణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలపై దృష్టిసారించారు.

–ఈనాడు, మహబూబాబాద్

'ఉమ్మడి వరంగల్‌లో ఈ వానాకాలంలో వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 9,02,233 ఎకరాల్లో వరి సాగవుతోంది. క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సన్నాల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మొత్తం సాగులో 90 శాతం వరకు ఇవే ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. దీని ప్రకారం 10 శాతమే దొడ్డు రకాల సాగైనట్లు లెక్క.'



ధాన్యం ధరలు

☛ ఏ గ్రేడ్ రకం (క్వి. రూ.): 2320

☛ సాధారణ రకం (క్వి.రూ.): 2300

జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలు

జిల్లా	ధాన్యం కేంద్రాల సంఖ్య	ధాన్యం సేకరణ లక్ష్యం(టన్నుల్లో)
మహబూబాబాద్	234	2,88,000
వరంగల్	203	2,40,000
భూపాలపల్లి	189	2,00,000
జనగామ	180	2,00,000
ములుగు	173	1,50,000
హనుమకొండ	149	1,50,000

ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,128 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 12.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించాలని పౌరసరఫరాలశాఖ అధికారులు నిర్దేశించుకున్నారు. అత్యధికంగా మహబూబాబాద్, అత్యల్పంగా హనుమకొండ, ములుగు జిల్లాలో సేకరణ లక్ష్యం ఉంది. 12.28 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలుకు 3.07 కోట్ల గన్నీ సంచులు అవసరం. అకాల వర్షం వస్తే నష్టం జరగకుండా టార్పాలిన్ పరదాలు అవసరం. ఇందుకు దాదాపు 35 వేల పరదాలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఏఈవోలే కీలకం

ధాన్యంలో తేమశాతం, నిబంధనల ప్రకారం సన్నాల నిర్ధారణ చేసి టోకెన్లు జారీ చేయడంలో వ్యవసాయ విస్తర్ణాధికారులు(ఏఈవో) కీలకం. బోనస్ వర్తించే 33 రకాల సన్నాల గుర్తింపులో తగిన జాగ్రత్తలు పాటించాలి. సన్నధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. ఈ యంత్రం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు.

ఇలా గుర్తిస్తారు..

ప్రతి గ్రామంలో సన్నాలకు, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఒకేచోట రెండూ కొనుగోలు చేస్తే తూకాలు వేర్వేరుగా చేస్తారు. సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుడుతారు. సన్నాల బస్తాలపై 'వై' ఆకారం గుర్తును, కొనుగోలు కేంద్రం సంఖ్య ముద్ర వేయాలని అధికారులు నిర్ణయించుకుంటున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

☛ కేంద్రాల వద్ద రైతుల కోసం నీడ, తాగు నీటి వసతిని కల్పించాలి.

☛ తూకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలి.

☛ కాంటా పూర్తయిన వెంటనే బస్తాలను మిల్లులకు తరలించాలి. మిల్లరు సైతం ధాన్యంలో తేడాలున్నాయని సాకులు చెబుతూ పెట్టే కోతలను నివారించాలి.

☛ ఏఈవోలు ఇచ్చిన టోకెన్ల ప్రకారం తూకాలు వేయాలి.

పొంచి ఉన్న ప్రమాదం



జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలోని పలు ప్రధాన రహదారుల పక్కకు ఉన్న కొన్ని చెట్లు ఎండిపోయి ప్రమాదకరంగా మారాయి. హనుమకొండ రోడ్డు వైపు గురుద్వార్ ఎదురుగా ఓ చెట్టు పూర్తిగా ఎండిపోయి ఈ స్థితికి చేరింది. వాహనదారులు, పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

పండగ వేళ.. ట్రాఫిక్ పద్మవ్యూహం



కాజీపేట బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ.. ఇక్కడ రైల్వే వంతెన ఒకటే ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న మరో రైల్వే వంతెన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సిబ్బంది లేక ఇబ్బందులు
- ప్రతినెలా 4 వేల వరకు కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.

వరంగల్ క్రైం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా పండగను పురస్కరించుకొని వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ సామగ్రి, దుస్తుల కొనుగోళ్లకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివస్తున్న ప్రజలతో మార్కెట్ రోడ్లన్నీ కిక్కిరిసి పోతున్నాయి. కాజీపేట నుంచి వరంగల్, కరీంనగర్ రహదారిలో వాహనాల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పండగ రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, నగరవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..



తిరుమల జంక్షన్‌లో..



ఇదీ పరిష్కారం..

- రోడ్లు ఇరుకుగా ఉండి జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వన్‌వేలను ఏర్పాటు చేయాలి.
- సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ఉదయం, సాయంత్రం కళాశాలలు, పాఠశాలల సమయంలో అదనంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి.
- రద్దీని బట్టి ట్రాఫిక్ కూడళ్ల వద్ద అదనంగా సిబ్బందిని కేటాయించాలి.

రోడ్లపై 2 లక్షలకు పైగా వాహనాలు..

- పోలీసు శాఖ లెక్కల ప్రకారం కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో రెండు, నాలుగు చక్రాలు, భారీ వాహనాలు కలిపి సుమారు 4.50 లక్షల వరకు ఉంటాయి. ప్రతి రోజు ఇతర ప్రాంతాల నుంచి లక్ష వరకు వాహనాలు నగరానికి వచ్చి వెళ్తుంటాయి. అన్ని కలిపి నగరంలో రోజుకు 2 లక్షలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయని పోలీసుల అంచనా. పండగల వేళ మరో 20 వేలు అధికంగా తిరుగుతుంటాయి.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలాన్లు ఇలా..

నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు విధించిన ట్రాఫిక్ చలాన్లు కేసుల నమోదు

ఉల్లంఘనలు	కేసుల సంఖ్య	జరిమానా (రూ.లలో)
హెల్మెట్ లేకుండా చలాన్లు	2,56,767	4,24,71,300
రాంగ్ రూట్ డ్రైవింగ్	11,531	22,92,400
ట్రిపుల్ రైడింగ్	10,261	1,19,91,600
చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్	6004	59,58,000

ఇదీ పరిస్థితి..

పెరిగిన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రస్తుతం నగరంలోని మూడు ట్రాఫిక్ ఠాణాలోని సిబ్బంది సరిపోవడం లేదు. ఏఆర్ విభాగం నుంచి కొందరిని కేటాయించారు. అయినప్పటికీ కాజీపేట ఫాతిమా నగర్ బ్రిడ్జి, పెట్రోల్‌పంపు, లష్కర్‌బజార్, హనుమకొండ చౌరస్తా, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, నయీంనగర్, వరంగల్ పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, ఎస్‌వీఎన్ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటుగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

- పదేళ్లలో నగరంలో వాహనాల సంఖ్య వంద శాతం పెరిగింది. ఆ స్థాయిలో రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. పండగల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని పెంచాలి.



వరంగల్ చౌరస్తాలో అన్ని వైపులకు ఒకరే ట్రాఫిక్ పోలీసు..

సిబ్బంది సంఖ్య పెరగాలి..

ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్ పరిధిలో 14 నుంచి 16 కిలో మీటర్ల వరకు ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇన్ని కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలంటే సుమారు 400లకు పైగా సిబ్బంది అవసరం.

- ప్రస్తుతం 140 మంది ట్రాఫిక్ సిబ్బంది, 100 మంది హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు పెరిగాయి. నగర శివారులతో కలిపి మొత్తం 51 ట్రాఫిక్ పాయింట్లు, 11 సిగ్నల్స్ ఉన్నాయి.
- నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణాలు మాత్రమే ఉన్నాయి. మరో మూడు అవసరం ఉంది.

పార్కింగ్‌తో సమస్య..

నగరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయి. వీటిలో షాపింగ్ చేసేందుకు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు.

ఇలా చేద్దాం: షాపింగ్ మాల్స్ ఆవరణలోని సెల్లార్లల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

- వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి. రాంగ్ రూట్‌లో రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఇబ్బందులు ఉండవని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

మహాలక్ష్మీ.. కరుణించు తల్లీ!



రంగంపేట, న్యూస్‌టుడే: సిరి సంపదలివ్వమ్మా శ్రీమహాలక్ష్మీ అంటూ భక్తులు వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం భద్రకాళి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం, సాయంత్రం గిరిజా దుర్గార్చన పూజారాధనలు జరిపారు. ఉదయం 11 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంస వాహన సేవలు నిర్వహించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అందరూ ముఖ్యులే.. సాధారణ భక్తులకు అవస్థలు!



అమ్మవారి దర్శనానికి వరుసలో ఉన్న సాధారణ భక్తులు



వీఐపీ ద్వారం వద్ద రద్దీ

రంగంపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులు భద్రకాళి ఆలయానికి పోటెత్తుతున్నారు. రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు, ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేయడం లేదు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 2-3 గంటల పాటు అన్ని క్యూలైన్లలో సాధారణ భక్తులు బారులుతీరారు. వీళ్లను అలాగే వదిలేసి వీఐపీ(అత్యంత ముఖ్యమైన వ్యక్తి) ద్వారంలో నుంచి వందలాది మందిని ఒకేసారి లోనికి పంపించడంతో గందరగోళం నెలకొంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు, అర్చకులు బంధువులు, స్నేహితులను వీఐపీ మార్గం గుండా తీసుకెళ్లారు. గంటల తరబడి సాధారణ భక్తులు క్యూలైన్లలో విలవిల్లాడారు. తాగునీటి కోసం అల్లాడారు. రద్దీని కట్టడి చేసేందుకు వెళ్లిన ఈవో శేషుభారతి సైతం అందులో ఇరుక్కుపోయారు. సాధారణ భక్తులను వదిలేసి వీఐపీ మార్గానికే ప్రాధాన్యం ఇచ్చారని భక్తులు నిలదీశారు.

ప్రైవేటు పెత్తనం..: భద్రకాళి ఆలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేరుతో పలువురు.. మాజీ ధర్మకర్తలు, దాతల పేరుతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. వీఐపీ క్యూలైన్ వద్ద వారిదే హవా నడుస్తోంది. కొందరు అర్చకులు సైతం అతిగా వ్యవహరిస్తున్నారు. అడ్డదారిలో భక్తులను గర్భాలయంలోకి తీసుకెళ్తున్నారు.

నేడు ప్రపంచ పత్తి దినోత్సవం

తెల్లబంగారం.. అన్నింటికీ ఆధారం

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పండించే ప్రధాన పంట పత్తి.. ఇది వారికి ముఖ్యమైన ఆదాయ వనరు. సోమవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పంట ప్రధాన్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

పత్తి ప్రాధాన్యం.. ప్రాముఖ్యాన్ని గుర్తించడంతో పాటు పత్తిపై అవగాహన పెంచేందుకు, సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 7న ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది పత్తి దినోత్సవం ఉద్దేశం 'కాటన్ ఫర్ గుడ్'. దీనిని ప్రపంచ వాణిజ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ సంయుక్తంగా నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.



ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే

మీకు తెలుసా..

- ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం 40 శాతం తెల్లబంగారాన్ని పండిస్తోంది.
- ప్రపంచ వ్యాప్తంగా పత్తిని వాణిజ్య పంటగానే కాకుండా ఆహార, చమురు పంటగా గుర్తిస్తున్నారు. పత్తి గింజలను వంట నూనెగా, గింజల చెక్కను పశు దాణాగా వాడుతున్నారు. కొన్ని దేశాల్లో గింజల నూనెను జీవ ఇంధనం తయారీకి వినియోగిస్తున్నారు.
- పత్తి తన సొంత బరువు కన్నా 27 రెట్లు నీటిని గ్రహించగలదు. దాంతో కావాల్సిన సాంద్రతతో వస్త్రాలను నేయవచ్చు. నాణ్యత కాటన్ ఫ్యాబ్రిక్‌కు సులభంగా రంగులు వేసేందుకు వీలుగా ఉంటుంది.
- ఓ జీన్స్ తయారీకి 0.68 కిలోలు, చొక్కాకు 0.28 కిలోలు, టీషర్టుకి 0.23 కిలోలు, డైపర్ తయారీకి 0.07 కిలోలు, టవల్‌కు 0.28 కిలోలు పత్తి అవసరమని అంచనా.

రంగురంగుల్లో.. పంట

పత్తి అనగానే మనకు తెల్లని దూది మాత్రమే స్ఫురిస్తుంది. ఆ దూదిని రంగురంగుల్లో పండించేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. నాగపూర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ సంస్థ, దార్వాడలోని అగ్రికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీలకు చెందిన నిపుణులు రంగుల పత్తి వంగడాలను సృష్టించి, ఏడేళ్లుగా వివిధ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. సహజసిద్ధంగా పత్తికి రంగు రావడంతో.. అదనంగా పత్తి దారాలకు రంగు నీళ్లలో ముంచాల్సిన అవసరం ఉండదు. దాంతో జల కాలుష్యాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.





హనుమకొండ జిల్లా ఆత్మకూరులో పత్తి తీస్తున్న మహిళా కూలీ (పాతచిత్రం)

ఏడాది పొడవునా ఉపాధి..

అంతర్జాతీయ పత్తి సలహా కమిటీ(ఐసీఏసీ) అంచనా ప్రకారం.. రైతు పండించిన ఓ టన్ను పత్తి అయిదుగురికి ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తోంది. వైద్య రంగం, పశుగ్రాసం, వంటనూనె పరిశ్రమలతో పాటు వస్త్ర పరిశ్రమలకు ఇది ముడి సరకు. వ్యవసాయం, తయారీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 20 వేల మందికి పైగా పత్తి పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. రైతులు, కూలీలతో పాటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఫిట్టర్లు, ప్రెస్సింగ్, జిన్నింగ్ ఆపరేటర్లు, హమాలీలు, మార్కెటింగ్‌శాఖ, వస్త్ర పరిశ్రమ, తదితర అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉపాధి లభిస్తోంది.

- ఉమ్మడి జిల్లాలో మొత్తం 55 జిన్నింగ్ మిల్లులుండగా.. ఒక్కో మిల్లులో సుమారు 150 మంది పనిచేస్తూ.. తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

ఉమ్మడి వరంగల్‌లో పండిన పత్తిని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి స్పిన్నింగ్ చేసిన దూది బేళ్లు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, వియత్నాం, చైనా దేశాలకు ఎగుమతి అవుతుంది. పత్తి నుంచి వేరుచేసిన గింజలను వంట నూనె, పశువుల దాణా తయారీ కోసం హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.

పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో పత్తి ఆధారిత, అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడ పండిన దిగుబడులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు రవాణా భారం తగ్గుతుంది. యూరియా సంచుల్లో రైతులు పత్తిని తీసుకురావడం వల్ల తెల్లని ప్లాస్టిక్ వ్యర్థాలు పత్తిలో కలిసిపోతున్నాయి. స్పిన్నింగ్ మిల్లులు అలాంటి పత్తిని తిరస్కరిస్తున్నాయి. ప్రభుత్వం యూరియా బస్తాల రంగును మార్చడం ద్వారా ఈ సమస్య పరిష్కరించవచ్చు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వివరాలు

జిల్లా	పత్తి సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)
వరంగల్	1,20,037	96,030
హనుమకొండ	77,330	61,864
జనగామ	1,25,195	1,00,156
భూపాలపల్లి	91,281	73,025
ములుగు	21,114	16,891
మహబూబాబాద్	78,332	62,666

నేడు, రేపు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు, 10 క్రీడా పాఠశాలల నుంచి అథ్లెట్లు హాజరవుతారన్నారు. ముఖ్య అతిథిగా పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, ఇతర జాతీయస్థాయి అథ్లెట్లు, ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.


పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకం



సాధించిన పతకంతో సుకన్య

సీరోలు(కురవి), న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం రేకుల తండా గ్రామపంచాయతీ శివారు జగ్యాతండాకు చెందిన తేజావత్ సుకన్య కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో రజత పతకం సాధించారు. మారుమూల గిరిజన తండాలోని మధ్య తరగతి గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమె క్రీడల్లో రాణించాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆమె తొలుతగా వెయిట్ లిఫ్టింగ్‌తో ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందారు. 2024 జూన్‌లో దక్షిణ ఆఫ్రికా దేశంలో పవర్‌లిఫ్టింగ్‌లో రాణించి పతకం సాధించారు. ఈనెల 4 నుంచి దక్షణాఫ్రికా దేశంలోని సన్‌సిటీలో జరుగుతున్న పోటీల్లో శనివారం రాత్రి జరిగిన బాలికల విభాగం పవర్‌లిఫ్టింగ్‌లో 76 కిలోల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నారు. తండ్రి లక్ష్మణ్ ఇల్లందులో సింగరేణి ఉద్యోగం చేస్తున్న క్రమంలో తల్లిదండ్రులతో కలిసి రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు. అక్కడ కొంత మంది వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తుండగా వారితోపాటు సుకన్య చేసేవారు. ఆసక్తి పెరగడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొంది జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించారు. దక్షిణ ఆఫ్రికాకు వెళ్లేందుకు సహకరించిన గ్రీన్‌కో సంస్థ గ్రూపు ఛైర్మన్ అనీల్‌కుమార్‌శెట్టికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగుపాటుతో ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆర్.సింగారం రఘు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పిడుగుపడి ప్రైవేటు కంపెనీలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజదాని అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. నిర్మాణ సామగ్రి సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది నివాసం కోసం ఆలేరు, నర్సింహులగూడెం గ్రామాల పరిధిలో క్యాంప్ ఏర్పాటు చేశారు. తమిళనాడు రాష్ట్రం వెళ్లూరు జిల్లా తిరుపత్తూరు, పెరియార్‌కొట్టం ప్రాంతానికి చెందిన ఇంజినీరు ఆర్. సింగారం రఘు మూడు నెలల నుంచి పనిచేస్తున్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం ఆరుబయట చరవాణిలో మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన తీవ్రంగా గాయపడగా అక్కడ ఉన్న వారు సీపీఆర్ చేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను రికార్డు చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న కోదండరాం, వేదికపై అంబటి శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: భావితరాలకు తెలిసేలా తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేయాలని ఎమ్మెల్సీ, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. ఈ చరిత్రను మరుగున పడేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఐకాస నర్సంపేట డివిజన్ కమిటీ, తెజస ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో వేడుకల మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ ఉద్యమకారుల సదస్సులో కోదండరాం మాట్లాడారు. స్వయంపాలన కోసం అరవై ఏళ్లుగా ఎన్నో సంఘాలు, ఎందరో చేసిన పోరాటం, 1200 మంది ప్రాణత్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నిర్బంధాలు, ఫోన్‌ట్యాపింగ్, అక్రమ అరెస్టులు లేవని, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పాటుపడదామన్నారు. అమరుల కుటుంబాలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులిచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద కోదండరాంకు స్థానికులు స్వాగతం పలికారు. అమరవీరుల స్తూపం, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, వడ్డెర జాతి నాయకుడు ఓబలన్న విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదన్నారు. కేయూ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రసంగిస్తూ గత పదేళ్లలో తెలంగాణ వనరులను దోపిడీ చేసిన దొంగలు పది నెలల్లో ఏదో జరిగినట్లు రచ్చ చేస్తున్నారన్నారు. ఈ సర్కార్‌ను కాపాడుకోవాలన్నారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో నిట్ ప్రొఫెసర్ రమ, ఉద్యమకారులు, ప్రజా సంఘాల, ఐకాస నాయకులు రామ్మూర్తి, జావిద్, అరుణ, ఖాలీ సయ్యద్, అరుణ, డాక్టర్ జగదీశ్వర్, రమాదేవి పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు కోదండరాంకు వినతి పత్రాలు సమర్పించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

మినీ స్టేడియం అభివృద్ధి చేయాలని డిమాండ్


జెండా ఆవిష్కరిస్తున్న బూడిద గోపి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని సంజయ్‌నగర్‌లోని మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి డిమాండ్ చేశారు. పార్టీ ప్రథమ మహాసభ ఆదివారం నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. అనంతరం బూడిద గోపి మాట్లాడుతూ... మినీ స్టేడియం ఏర్పాటు చేసినప్పటికీ అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. శ్మశాన వాటికలో మౌలిక వసతులు లేక ఇబ్బంది మారిందన్నారు. సమావేశంలో నాయకులు బొట్ల శేఖర్, జోగు ప్రకాశ్, కల్యాణం లింగం, సౌందర్య తదితరులు పాల్గొన్నారు. 16 వార్డు పార్టీ కార్యదర్శిగా కల్యాణం లింగం, సహాయ కార్యదర్శిగా అంజమ్మ ఎన్నికయ్యారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



నర్మెట్ట(తరిగొప్పుల), న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని భాజపా జిల్లా కార్యదర్శి దారవత్ రాజు అన్నారు. పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాలో కేంద్ర ప్రభుత్వం జమ చేసిన సందర్భంగా భాజపా నాయకులు ఆదివారం నర్మెట్ట మండల కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు రంగు మురళి మాట్లాడుతూ... భాజపాతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాజబోయిన శ్రీనివాస్, కొమురెల్లి, అనిల్ కుమార్, రాజు, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


లావణ్య


చరణ్

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: జఫర్‌గఢ్ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు పరుగు పందెంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంత్, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, శ్రీకాంత్ తెలిపారు. పాఠశాలకు చెందిన టి.చరణ్ 600 మీటర్లు, ఎం.లావణ్య 400 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో ఎంపిక కావడంతో వీరు ఈనెల 7న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్నిక

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తూడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొమ్మగల్ల కృష్ణ, కోశాధికారి తాండ్ర రామన్న, ఉపాధ్యక్షులుగా నాయిని రామస్వామి, నాగిళ్ల రాజు, గొడిశాల ఐలేశ్, బాలనర్సయ్య, బాబు, ప్రచార కార్యదర్శిగా రొడ్డ రాజు, తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి కార్మికులు అభినందనలు తెలిపారు.

జనగామలో ముస్లింల నిరసన


ఎస్సైకి ఫిర్యాదు అందిస్తున్న ముస్లిం సంఘాల ప్రతినిధులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ దస్నాదేవి ఆలయ పూజారి యతి నర్సింగానంద్ మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ జనగామలో ఆదివారం ముస్లింలు నిరసన చేపట్టారు. ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నర్సింగానంద్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణ ఎస్సై రాజేష్‌కు ఫిర్యాదు అందించారు. కార్యక్రమంలో జమాల్‌షరీఫ్, మతీన్, షకీల్, రహీం, షాకీర్, యాకూబ్, కలీం, అబ్బాస్, సలీం తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడికి సన్మానం



జనగామ, న్యూస్‌టుడే: మూడు దశాబ్దాల క్రితం స్నేహం ప్రాథమిక స్థాయి నుంచి పది వరకు ఒకటిగా ఉన్నారు. తమలో ఒకడు కష్టాలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదిగి స్నేహితులకు, గురువులకు అండగా నిలుస్తున్నాడు. ఆర్టీసీ ఉద్యోగి దివంగత కొరివి రామచంద్రయ్య, అరుణ దంపతుల కుమారుడు నవీన్ కొరివి 2002-03లో స్థానిక అరబిందో ఉన్నత పాఠశాలలో పది పూర్తి చేశాడు. ఎంబీబీఎస్, ఉస్మానియా వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ పోస్టుగ్రాడ్యుయేషన్, న్యూరాలజీలో డాక్టర్ ఆఫ్ మెడిసిన్(డీఎం) పూర్తి చేసి వరంగల్‌లోని ఆసుపత్రిలో వైద్యసేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం జనగామలో నవీన్‌తో పాటు పాఠశాల వ్యవస్థాపక ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డిని పూర్వ విద్యార్థులు, టీఎన్జీవోస్, బియ్యం మిల్లుల సంఘంతోపాటు వివిధ సంస్థల ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రత్యేక మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తానని నవీన్ అన్నారు. కార్యక్రమంలో ప్రమోద్, సురేందర్, పాషా, అన్వర్, అఫ్రిన్, సుగుణాకర్‌రాజు, కౌన్సిలర్ కళ్యాణి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఖాజాషరీఫ్,

వీధి దీపాల ఏర్పాటు

జఫర్‌గఢ్: తమ్మడపల్లి(జి)లో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో గ్రామస్థులు అంధకారంలో ఉంటున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ తాజా మాజీ సర్పంచి అన్నెపు పద్మ అశోక్ తన సొంత ఖర్చులతో రూ.15 వేల విలువ కలిగిన విద్యుత్తు బల్బులను అందించడంతో సిబ్బంది స్తంభాలకు బిగించారు. పంచాయతీ కార్యాలయ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులను నూతన వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుజ్జరి రాజు, పంచాయతీ కార్యదర్శి కన్న హరీశ్, మాజీ ఉప సర్పంచి షరీఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


జనగామ:బతుకమ్మకుంటలో


పాలకుర్తి సోమేశ్వరాలయంలో..


రఘునాథపల్లిలో..


కూనూర్‌లో అమ్మవారు


తాటికొండలో..

దేవీ నవరాత్రి ఉత్సవాలు

జిల్లాలోని పలు గ్రామాల్లో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దుర్గాదేవి నాలుగో రోజు ఆదివారం మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు పంచామృత అభిషేకం, అర్చన, నిత్య హోమం పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. –న్యూస్‌టుడే యంత్రాంగం


బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌లో..


ఉప్పుగల్లులో లలిత త్రిపుర సుందర దేవిగా

చేప పిల్లల విడుదలకు సర్వం సిద్ధం..



జనగామ రూరల్, న్యూస్‌టుడే: మత్స్య సంపదను పెంచి వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారికి ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపల పంపిణీకి సంబంధిత శాఖ అధికారులు గతంలోనే ప్రణాళికను సిద్ధం చేశారు. వర్షాలు పడి టెండర్ల ఖరారు ప్రక్రియ ఆలస్యంగా సాగింది. నెల రోజుల క్రితం భారీ వర్షాలు కురవడంతో రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో 70-80 శాతం మేర నీరు చేరింది. దీంతో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాకు అవసరమైన లక్ష్యం మేరకు సన్నాహాలు చేస్తున్నారు.

చేపల పెంపకం లక్ష్యం: 1.36 కోట్లు
జిల్లాలో మొత్తం చెరువులు, కుంటలు: 732
మొత్తం మత్స్యకారుల సంఘాలు: 185
సభ్యుల సంఖ్య: 18000

పెంపకం విధానం ఇలా..

జిల్లాలో మొత్తం రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు 732 ఉన్నాయి. చెరువులు నిండితే 2.72 కోట్ల చేప పిల్లలను వదిలేందుకు ప్రణాళిక తయారు చేశారు. దీంతో సుమారు 2-3 వేల టన్నుల చేపలు ఉత్పత్తి కానున్నాయి.

☛ చెరువుల విస్తీర్ణం, నీటి నిల్వ ఆధారితంగా చేప పిల్లలను విడుదల చేయనున్నారు. గతంలో సామర్థ్యానికి మించి విడుదల చేసినా.. పురోగతి కనిపించకుండా పోయింది. దీంతో ఈ ఏడాది లక్ష్యాన్ని తక్కువకు కుదించారు. మొదట 2.72 కోట్లకు ప్రణాళికలు చేయగా.. చెరువులు, కుంటల్లో నీటి నిల్వ తక్కువగా ఉండటంతో 1.36 కోట్లకు లక్ష్యాన్ని కుదించినట్లు తెలుస్తోంది. దేవాదుల కాలువల ద్వారా చెరువులు, కుంటల్లో నీరు నింపితే మరో మారు 50 శాతం చేప పిల్లలు విడుదల చేయాలని జిల్లా యంత్రాంగం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

నీల రాజు, మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, జనగామ



చేప పిల్లల విడుదల ప్రారంభంతో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడనుంది. చేప పిల్లల పంపిణీలో నాణ్యమైన, సరైన కొలతలు కలిగిన వాటిని గుత్తేదారులకు అందేలా అధికారులు కృషి చేయాలి.

విడుదలకు అన్ని ఏర్పాట్లు..

- రాణా ప్రతాప్, మత్స్య శాఖ జిల్లా అధికారి, జనగామ

జిల్లా వ్యాప్తంగా చేప విత్తనాలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ నెల 7న స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకారుల చేతుల మీదుగా విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం.

సీబీఐ అధికారినంటూ రూ.28.50 లక్షల టోకరా

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: హనుమకొండ నగరంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తకు సీబీఐ అధికారులమంటూ సైబర్ నేరగాళ్లు రూ.28.50 లక్షలు టోకరా వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న పారిశ్రామిక వేత్తకు గుర్తు తెలియని మహిళ ఫోన్ చేశారు. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఆధార్‌కార్డు మొబైల్‌కు లింక్ చేయలేదని చెప్పారు. రెండు గంటల్లో ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తామని, త్వరలో మా ఉన్నతాధికారులు మీతో మాట్లాడతారని చెప్పి ఫోన్ పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత మరో మహిళ ఫోన్ చేసి తాను సీబీఐ ముంబయి బ్రాంచి అధికారినంటూ పరిచయం చేసుకున్నారు. తర్వాత వాట్సప్ వీడియోకాల్ చేసి సీబీఐ కార్యాలయం మాదిరిగా ఉన్న సెట్టింగ్‌ను చూపారు. మీరు మనీ ల్యాండరింగ్‌లో పాల్గొన్నారని, మీపై సీబీఐ కేసు నమోదు చేసిందని చెప్పారు. ఎప్పుడైనా మీ వద్దకు వచ్చి మా అధికారులు అరెస్టు చేస్తారని భయాందోళనకు గురిచేశారు. నరేష్ గోయల్ అనే వ్యక్తి మీ ద్వారా సుమారు రూ.6.8 కోట్లు మనీ ల్యాండరింగ్ చేశారని, అందుకోసం మీకు రూ.18.16 లక్షల కమీషన్ ఇచ్చారని చెబుతూ.. పూర్తి వివరాలు మా వద్ద ఉన్నాయని, ఈ కేసు నుంచి మీరు తప్పించుకోలేరని బెదిరించారు. ప్రస్తుతం మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు మేం సూచించిన ఖాతాలోకి మళ్లించాలని, కేసు విచారణ పూర్తయ్యాక ఎన్‌వోసీ ధ్రువీకరణతో పాటు మీ డబ్బు అప్పగిస్తామని నమ్మించారు. వారి మాటలకు భయపడిన పారిశ్రామికవేత్త తనకు ఉన్న రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.28.50 లక్షలు వారు చెప్పిన ఖాతాలోకి మళ్లించారు. రెండ్రోజుల తర్వాత అవతలి వ్యక్తుల నెంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

చెరువులో మునిగి యువకుడి దుర్మరణం


పవన్(పాత చిత్రం)

రఘునాథపల్లి: ప్రమాద వశాత్తు చెరువులో మునిగి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మల్లంపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గంగాధరి అంజయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని కొత్తపేటలో నివాసం ఉంటున్నారు. మల్లంపల్లిలో ఆయన అన్నయ్య కుమారుడు ఇటీవల మృతి చెందడంతో కుమారుడు పవన్‌తో కలిసి కర్మకాండలో పాల్గొనేందుకు వచ్చారు. దశదిన కర్మలో భాగంగా స్థానిక లక్ష్మీ చెరువులో స్నానం చేస్తున్న క్రమంలో పవన్ (28) ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. గమనించిన బంధువులు అతన్ని కాపాడే ప్రయత్నం చేస్తుండగానే మృతిచెందాడు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై డి. నరేశ్ వివరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జఫర్‌గఢ్: మండలంలోని తిడుగు ఆకేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని ఆదివారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బానోతు రామ్‌చరణ్ తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాగి తీగ చోరీ



కొడకండ్ల: విద్యుత్తు నియంత్రికలోని రాగి తీగ చోరీకి గురైనా సంఘటన మండలంలోని లక్ష్మక్కపల్లిలో చోటుచేసుకుంది. గ్రామంలో ఎనిమిది మాసాల్లో ఆరు నియంత్రికల్లో రాగి తీగను ఎత్తుకెళ్లారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ శివారుల్లోని 25 కేవీ నియంత్రికలోని రాగి తీగ చోరీ చేసినట్లు మండల విద్యుత్తు అధికారి ఎ. రాములు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పొట్ట దశలో ఉన్న వరికి నీటి సరఫరా నిలిచి ఎండిపోయే ప్రమాదం ఉందని, అధికారులు విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాలని రైతులు వేడుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

తరిగొప్పుల, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికలోని రాగి తీగను చోరీ చేసిన సంఘటన మండలంలో చేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం. . మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన బత్తిని నాగరాజుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో రాగి తీగను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.

శునకాల దాడిలో ఇద్దరికి గాయాలు

పాలకుర్తి: శునకాల దాడిలో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలోని చెన్నూరులో జరిగింది. ఆదివారం ఇంటి ముందుకు కూర్చొన్న బస్నెపాక ఎల్లమ్మ, కార్తీక్‌పై దాడి చేశారు. పాలకుర్తికి తరలించి టీకాలు ఇప్పించారు. పల్లెలో పిచ్చి కుక్కల బెడద ఎక్కువగా ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అదృశ్యంపై కేసు నమోదు..


వేణు(పాత చిత్రం)

చిల్పూర్, న్యూస్‌టుడే: మల్కాపూర్ గ్రామానికి చెందిన నామాల వేణు(21) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగపల్లిలో పోస్ట్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వేణు శనివారం సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో వారిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బతుకమ్మ ఆడిన పూర్వ విద్యార్థులు


కూనూర్ జడ్పీ పాఠశాలలో..

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: కూనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ కమిటీ అధ్వర్యంలో పూర్వ విద్యార్థులతో ఆదివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కూనూరులో ఉన్నత పాఠశాల ఏర్పడి 50 ఏళ్లు కావస్తున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థులతో ప్రతి ఆదివారం వివిధ సన్నహక కమిటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు, నేడు పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు, విద్యార్థినులతో బతుకమ్మలను అందంగా పేర్చి ఉత్సాహంగా డీజే సౌండ్‌ల మధ్య కోలాటాలతో బతుకమ్మ పాటలను ఆడి, పాడి సందడి చేశారు.

రహదారిపై అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వెళ్లే రహదారిలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి రహదారిపైకి వచ్చి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారడంతో మాజీ వైస్ ఎంపీపీ చల్ల సుధీర్‌రెడ్డి సొంత ఖర్చులతో డోజర్ సాయంతో తొలగింప చేశారు. పిచ్చి మొక్కలన్నీ రహదారిపైకి రావడంతో ఆటోలు నడుపుకునే వారికి ఇబ్బందిగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్లు తన దృష్టికి తీసుకురాగా చెట్లను తొలగించినట్లు సుధీర్‌రెడ్డి వివరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

చిల్పూర్: మండలంలో ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై సిరిపురం నవీన్ కుమార్ హెచ్చరించారు. చిన్నపెండ్యాల శివారు ఆకేరు వాగు నుంచి ఆదివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని.. డ్రైవర్ ఇల్లందుల హరిబాబుపై కేసు నమోదు చేసి.. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్‌లో గౌడ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా కోట సతీశ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కోట గురుప్రసాద్‌గౌడ్, కోశాధికారిగా మోడెం అశోక్‌గౌడ్, చిట్టి కార్యదర్శులుగా సాయిగౌడ్, నరేశ్‌గౌడ్, సభ్యులుగా కిరీటీగౌడ్, కె.రాజు గౌడ్, కోట గణేశ్ గౌడ్, గడ్డం భరత్, చిర్ర తిరుపతిగౌడ్ , సలహాదారులుగా ముప్పిడి శ్రీనివాస్‌గౌడ్, గడ్డం హరీశ్‌గౌడ్ ఎన్నికైనట్లు తెలిపారు.

ఈవోగా పదోన్నతి

లింగాలఘనపురం: జీడికల్ సుప్రసిద్ధ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తున్న కొండబోయిన రాములు ఈవోగా పదోన్నతి పొందారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఉప్పలమ్మ దేవాలయం ఈవోగా పదోన్నతి కల్పిస్తూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ నియామక పత్రాన్ని రాములుకు అందజేశారు. రెండు దశాబ్దాలుగా వీరాచల రామచంద్రస్వామికి సేవలు అందించినందుకు ఈవోగా పదోన్నతి లభించిందని రాములు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులకు, ఈవోకు, సిబ్బందికి, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు అండగా ఎర్ర జెండా

జఫర్‌గఢ్: పేదలు, కష్టజీవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీపీఎం రాజీలేని పోరాటాలు చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య అన్నారు. మండలంలోని కూనూర్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ గ్రామ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి యాట మల్లయ్య అధ్యక్షత వహించారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పని చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శిగా శాగ యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శాగ శ్రీను, ఓరుగంటి తిరుపతి, నాగరాజు, నరేశ్, లక్ష్మీ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆపూర్వ సమ్మేళనం


తిమ్మంపేటలో..

జఫర్‌గఢ్: తిమ్మంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998-99లో ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ప్రాంగణంలో ఆపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. 34 ఏళ్ల తరువాత తాము చదువుకున్న పాఠశాలలో అనాటి మిత్రులను కలుసుకొని సంబరాలు జరుపుకున్నారు. తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యుగేందర్, నాగరాజు, మహేశ్, యాకస్వామి, రేవతి, సరస్వతి, స్వరూప, యాదలక్ష్మి, కవిత, అనాటి ప్రధానోపాధ్యాయుడు దస్తగిరి, ఉపాధ్యాయులు నర్సయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872	(10 AM TO 1 PM)
జనగామ అర్బన్:80749 20132	
పాలకుర్తి: 98663 66702	
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243	
జఫర్‌గఢ్: 98662 50618	

పాలకుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గౌడ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంది. **- సోమయ్య, పాలకుర్తి**

సమాధానం: సిబ్బందితో దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వరచారి, కార్యదర్శి, పాలకుర్తి

'గ్రామాల్లో మద్యం అమ్మకాలు అరికట్టాలి'

జనగామ రూరల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో విచ్చలవిడిగా, అక్రమంగా సాగుతున్న మద్యం అమ్మకాలను అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మరిగడిలో ఆ పార్టీ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. సమావేశానికి నాయకులు బోడ రాములు అధ్యక్షత వహించారు. కనకారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మద్యం అమ్మకాలు ప్రజలకు శాపంగా మారాయని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యువత చెడు బారిన పడుతున్నారని, జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు బోడ నరేందర్, మీట్యానాయక్, బాల్నే కిష్టయ్య, బోడ లక్ష్మయ్య, నారాయణ, సమ్మయ్య, అశోక్, మల్లేశ్, పాండు, సిద్దులు, సాంబరాజు, సంపత్, పవన్, నవీన్ పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొడకండ్ల, న్యూస్‌టుడే: పాఠశాలలో తమతో పాటు పదో తరగతి వరకు విద్యనభ్యసించిన స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించి స్నేహం గొప్పతనాన్ని చాటిచెప్పారు. కొడకండ్ల మండలం ఏడనూతుల గ్రామానికి చెందిన బి.కృష్ణచారి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం అతడి మిత్రులు బాధిత కుటుంబానికి రూ.60,500 నగదు అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని స్నేహితులు లక్ష్మీనారాయణ, వెంకన్న, ఉపేంద్రాచారి, లింగయ్య తదితరులు వివరించారు.

ఎల్‌వోసీ అందజేత

తరిగొప్పుల, న్యూస్‌టుడే: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన జొన్నగోని సృజన అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. సానుకులంగా స్పందించిన కిరణ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో బాధితురాలికి రూ.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఆదివారం ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్జుల సుధాకర్‌రెడ్డి, బైకాని బాల్‌రాజు, నర్సింహులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ బతుకమ్మ



జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: కూనూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పడి 50 ఏళ్లు గడుస్తున్న నేపథ్యంలో పూర్వ విద్యార్థులతో భారీ బతుకమ్మను ఏర్పాటు చేసి ఆడి, పాడి సందడి చేశారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు సత్కారం



రఘునాథపల్లి, న్యూస్‌టుడే: వరంగల్ నుంచి హైదరాబాద్ వెళ్తూ ఎమ్మెల్సీ కోదండరాం ఆదివారం రఘునాథపల్లిలో కొద్దిసేపు నిలిచారు. కోళ్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఆయనను సన్మానించారు. కోదండరాం ఇక్కడి రాజకీయ పరిస్థితుల గురించి ఆరా తీశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేసి, ప్రజలకు చేరవేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కమిటీ సభ్యుడు గాదె మహేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేశ్, నాయకులు రంగు రాజు గౌడ్, జీడికంటి రాజ్ కుమార్, ఎడ్ల భాస్కర్, చింతకింది శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాలుగో వార్డు కమిటీ ఎన్నిక

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పట్టణంలోని నాలుగో వార్డులో సీపీఎం నూతన వార్డు కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ ఆధ్వర్యంలో వార్డు కార్యదర్శిగా కొమ్మగల్ల మని, సహాయ కార్యదర్శులు అండాలు, బొందుగుల కవిత ఎన్నికయ్యారు.

విహారానికి వచ్చి మృత్యుఒడిలోకి..

● దుసపాటిలొద్ది జలపాతంలో యువకుడి మృతి


అభినవ్ (దాచినచిత్రం)

వాజేడు, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి సరదాగా జలపాతంలో గడిపేందుకు వచ్చిన యువకుడు ఆదివారం ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల సమీపంలోని దుసపాటిలొద్ది జలపాతంలో మునిగి మృతిచెందారు. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన బండారి అభినవ్ (19) ఘట్‌కేసర్ అనురాగ్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తన స్నేహితులు ఆరుగురితో కలిసి ఆదివారం ఉదయం కొంగాల సమీపంలోని దుసపాటిలొద్ది జలపాతానికి చేరుకున్నారు. కొంగాల అడ్డరోడ్డు వద్ద విధులు నిర్వహించే అటవీ సిబ్బంది రావడానికి ముందుగానే జలపాతానికి వెళ్లారు. స్నేహితులతో కలిసి సరదాగా నీటిలో గడిపేందుకు జలపాతంలో దిగిన అభినవ్ నీటిలోని రాయిపై అడుగువేసిన వెంటనే నీటిలోకి జారిపోయాడు. సంఘటనను గుర్తించిన స్నేహితులలో ఒకరు కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వాజేడు ఎస్సై హరీశ్ వాజేడు నుంచి మత్స్యకారులను, కొంగాల పంచాయతీ సిబ్బందిని సంఘటన స్థలానికి పంపారు. దుసపాటిలొద్దిలోని లోతైన నీటిలో మత్స్యకారులు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. దట్టమైన అటవీప్రాంతంలోని దుసపాటిలొద్ది జలపాతం నుంచి స్ట్రెచర్‌పై మృతదేహాన్ని స్థానికులు మోసుకొచ్చారు. మృతదేహాన్ని ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తరలించారు. స్నేహితులతో కలిసి జలపాతానికి వచ్చిన అభినవ్ ప్రమాదవశాత్తు మృతిచెందాడని మృతుడి బాబాయి మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.